క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తారకరామా కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.40 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆదుకుని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మంచి మనసును చాటుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లోనూ ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత సుంకరి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నారాయణరావు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: మండలంలోని ఇల్లంనాయుడువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోర నారాయణరావును వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నారాయణరావు గాయాల పాలై, చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజేష్ గ్రామానికి సోమవారం చేరుకుని, ఆయనను కలిసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గతంలో లాగే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పార్టీ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 66 మంది ఎంపిక


కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. తిరుపతికి చెందిన నవజీవన్ సంస్థ ఆర్థికసాయంతో స్పందన స్వచ్ఛంద సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ శిబిరంలో 152 మంది నేత్రవైద్య తనిఖీలు చేయించుకున్నారు. వీరిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 66 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరిని ప్రస్తుతం ఆపరేషన్ కోసం ఆస్పత్రికి తరలించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ కె.ఎస్.ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


బూరాడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మండలంలో బూరాడ జంక్షన్ వద్ద ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం, డబ్బు, ఎన్నికల తాయిలాలు ఏవైనా రవాణా చేస్తున్నారా లేదా అనే అంశం పరిశీలించారు. ప్రతిరోజూ వాహన తనిఖీలు చేస్తామని, అక్రమంగా ఏవైనా తరలిస్తే కేసు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

గుర్ల: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు చేశారు. గ్రామమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వీధిలో నివసిస్తున్న హృషికేశ్, నేహాపై సోమవారం పిచ్చికుక్కదాడిచేసింది. స్కూల్‌కు వెళ్లేసమయంలో ఇద్దరినీ గాయపరిచింది. వీరిలో నేహాకు దాక్టరైన తల్లి వైద్యం చేయగా, హృషికేష్‌ను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. గాయం కడిగేందుకు అక్కడ నీరు రాకపోవడంతో చిన్నారి తండ్రి రామకృష్ణ వైద్యులను నిలదీశారు. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి ఆస్పత్రులకు సదుపాయాలు కల్పిస్తుండగా, సరిగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. ఇదే కొనసాగితే సేవల తీరుపై న్యాయపోరాటం చేస్తానన్నారు.


నాడు–నేడు నిధులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన నందిగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

నాడు–నేడు.. బడి అందం చూడు!


ఆహ్లాదకర వాతావరణంలో సకల సౌకర్యాలతో పాఠశాల ఆవరణ

ఈ చిత్రంలో కనిపిస్తోంది.. టెక్కలి... తెర్లాం మండలంలోని నందిగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. ఇది ఒకప్పుడు చాలా అధ్వానంగా ఉండేది. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బడిలో సదుపాయాలు అరకొరగా మాత్రమే ఉండేవి. శిథిలమైన భవనంలో చాలీచాలని తరగతి గదులు, పెచ్చులూడిన గచ్చులు, సరైన తలుపులు కూడా లేని మరుగుదొడ్లు, అంతంతమాత్రంగానే తాగునీటి సదుపాయం, పాఠశాల ఆవరణ అంతా గోతులమయంగా ఉండే పరిస్థితులు కనిపించేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులకు విద్యే అసలైన ఆస్తిగా భావించింది. మనబడి నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రభుత్వ బడుల రూపురేఖలను సమూలంగా మార్చేసింది. ఈ క్రమంలో ఇక్కడి పాఠశాల సరికొత్త సొబగులు అద్దుకుంది. తొలి విడతలో మంజూరైన రూ.23 లక్షల నిధులతో పాఠశాల భవనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పాఠశాల ఆవరణను సైతం ఆహ్లాదకరంగా మార్చారు. విశాల ప్రదేశంలో ఆటస్థలం, మరుగుదొడ్లు, అన్ని తరగతి గదుల్లో కొత్త బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాల కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా కనిపిస్తుండడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సీఎం జగన్ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–తెర్లాం


పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన పార్క్

బొబ్బిలి గడ్డపై రైతుబిడ్డ గెలుపే లక్ష్యం

● ఎంపీపీ చౌక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో బొబ్బిలి గడ్డపై రైతుబిడ్డ శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మళ్లీ గెలిపించుకోవడంతో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని ఎంపీపీ చౌక్కాపు లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం జగనన్నను ఆదర్శంగా తీసుకుని నిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శంబంగిని మళ్లీ గెలిపించి, సీఎం జగన్‌కు కానుకగా ఇస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బీసీ నేతను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, దీనికోసం బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. గతంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని, ఆయనను ఆయనతో కలిసి వస్తున్న నేతలను నమ్మవద్దన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ పేరుతో చంద్రబాబు గతంలో చేసిన మోసాలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఎన్నికల వేళ మళ్లీ అవే అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్న


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

టీడీపీని చిత్తుగా ఓడించాలన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకే మళ్లీ ఓటు వేసి, సంక్షేమ పాలనను కొనసాగించుకోవాలన్నారు. మరింత మెరుగైన పాలనకు ప్రజల నుంచి సలహాలు, సూచనల కోసం మనమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు తాము కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు చౌక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

తెర్లాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలని బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆమె ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాల్లోని రాజకీయ నాయకుల ఫొటోలు వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఉన్న బ్యానర్లు, పోస్టర్లు తీసివేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతినెలా ఇచ్చే పౌష్టికాహారానికి సంబంధించిన పాలప్యాకెట్లు, ఇతర పౌష్టికాహార ప్యాకెట్లపై కూడా రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా తెల్లకాగితం అతికించాలన్నారు. సమావేశంలో తెర్లాం, లోచర్ల సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బాడంగి: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మండల కేంద్రంలోని రాజకీయ బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఈ చర్యలు చేపడుతోంది. మరోవైపు వాహన తనిఖీలు కూడా ముమ్మరం చేశారు. అక్రమంగా మద్యం, డబ్బు, గంజాయి, ఎన్నికల తాయిలాలు వంటివి రవాణా చేయకుండా చూస్తున్నారు.


బొబ్బిలి: ఆర్డీవో కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి: ఎన్నికల నేపథ్యంలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ దృష్ట్యా రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో పలు సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన రాజకీయ ప్రచార హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫెక్సీలు, స్టిక్కర్లను సిబ్బంది తొలగిస్తున్నారు.

● ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం


బొబ్బిలి: చింతాడ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


బాడంగి హైస్కూల్ సెంటర్ వద్ద విద్యార్థుల సందడి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ఆరంభమయ్యాయి. మండల కేంద్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్క్వాడ్‌లు సైతం ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి, మాస్ కాపీయింగ్ జరగకుండా చూశారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనివార్య కారణాల వల్ల తొలిరోజు పరీక్షలకు కొంతమంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.


రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆమె అన్ని కేంద్రాల్లో ప్రతిరోజూ పౌష్టికాహార పక్షోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, కార్యకర్తలంతా సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో తెర్లాం, పెరుమాళి సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

21నుంచి గొల్లపేరంటాలమ్మ జాతర

దీపురుపల్లి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తుల కల్పవల్లి మెట్టపల్లి గ్రామంలోని గొల్లపేరం టాలమ్మ వారి జాతర ఈనెల 21 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 22, 23, 24 తేదీల్లో నాలుగు రోజుల పాటు జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జాతరలో తొలిరోజు సీతారామ కల్యాణం, 22న రేలారే రేలా, 23న ఢీ జోడి, శ్రీదేవి డ్రామా కంపెనీ కళాకారుల ప్రదర్శన, 24న సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నామని పేర్కొన్నారు. జాతర విజయవంతానికి గ్రామపెద్దలు సహకరించాలని కోరారు.

ప్రజలు మెచ్చేవారికే సీట్లు



రాజాం/బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం త్వరలో జరగనున్న ఎన్నికల్లో విద్యావంతులు, రాజకీయ అనుభవంతో పాటు ప్రజలు మెచ్చేవారికే సీట్లు కేటాయించింది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకుంది. ప్రచారాలు ప్రారంభించిన వేళ.. అభ్యర్థుల బయోడేటాలను ఓ సారి పరిశీలిద్దాం.

పేరు: శంబంగి వెంకట చిన అప్పలనాయుడు
నియోజకవర్గం: బొబ్బిలి
కుటుంబ నేపథ్యం: భార్య చిన్నమ్మలు, ఇద్దరు కుమారులు, కుమార్తె
విద్యార్హత: బీఏ(సీఎల్)
స్వగ్రామం: యుక్త వయసు నుంచి రాజకీయంగా పలు పదవులు నిర్వహించారు. స్వగ్రామం పక్కి, బొబ్బిలి మండలం.
నిర్వహించిన పదవులు:

- పాలసేకరణ సంఘఅధ్యక్షుడు (1976–1984)
- గ్రామ సర్పంచ్, పక్కి(1981)
- బొబ్బిలి ఎమ్మెల్యే (1983)
- విశాఖ డెయిరీ చైర్మన్ (1984)
- బొబ్బిలి ఎమ్మెల్యే (1985)
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు (1987–89)
- రైల్వే జోన్ యూజర్స్ కమిటీ మెంబర్ (1988)
- నిజాం సుగర్స్ డైరెక్టర్ (1987–1989)
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు (1992–94)
- బొబ్బిలి ఎమ్మెల్యే(1994)
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధ్యక్షుడు (1994)
- రాష్ట్ర ప్రభుత్వ విప్(1995)
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు (1997–99, 2005, 2007)
- టీడీపీ బొబ్బిలినియోజకవర్గ ఇన్‌చార్జి (2009)

రాజాం నియోజకవర్గం



పేరు : డాక్టర్ తలే రాజేష్
ప్రస్తుత హోదా : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి
విద్యార్హతలు : ఎంబీబీఎస్, డీ ఆర్థో, డీఎన్‌బీ ఆర్థో, ఎఫ్ఐజేఆర్ (ఆర్థోపెడిక్ సర్జన్)
కుటుంబ వివరాలు
భార్య : డాక్టర్ గాయం మాధవీలత, గైనకాలజిస్ట్
కుమార్తెలు : తలే రిషిత (10వ తరగతి)
రితిక (6వ తరగతి)
తండ్రి : తలే భద్రయ్య, పాలకొండ ఎస్సీ నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించారు. (1985–89, 1994–99), అనంతరం 2004 నుంచి 2010 మధ్య కాలంలో ఏపీపీఎస్సీ మెంబర్‌గా సేవలు.
రాజకీయ నేపథ్యం
కొత్తగా రాజకీయ రంగ ప్రవేశం, తండ్రి తలే భద్రయ్య ఎమ్మెల్యేగా చేయడంతో కొంతమేర అవగాహన. తల్లి తలే నిర్మల పాలకొండ మండలంలో 1996–2001 మధ్య కాలంలో ఎంపీపీగా సేవలందించారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు
రాజాంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో 2013 నుంచి 2023 వరకు ఆర్థోపెడిక్ సర్జన్‌గా సేవలు అందించి 12 వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహణ. ఇందులో ప్రతి ఆపరేషనూ విజయవంతం. డాక్టర్ గా మంచి గుర్తింపు. పేదలకు ఆర్థిక సాయం చేస్తుంటారు. హైదరాబాద్‌లో సన్‌షైన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రుల్లో సేవలు అందించడంతో పాటు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ఏడాది కాలం పాటు సేవలు అందించిన అనుభవం. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చేసిన సమయంలో కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాలు.

అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాల తిరువీధిలో అప్రమత్తంగా ఉండాలని సీఐ తిరుమలరావు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్‌తో కలిసి జాతరలో భక్తులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. తిరువీధి సమయంలో తోపులాటలు జరిగే అవకాశం ఉన్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, 70 నుంచి 80 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోమవారం నుంచి జరిగే ఈ జాతర బుధవారం వరకు కొనసాగుతుందని, మంగళవారం ఘటాల తిరువీధి జరుగుతుందన్నారు.


సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు

ఘనంగా పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం సిటీ: పట్టణంలో పోలిపల్లి పైడితల్లి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, జిల్లా నలుమూలల నుంచి జాతరకు భక్తులు పోటెత్తడంతో సోమవారం ఆలయం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రాజాం: పోలిపల్లి పైడితల్లి జాతర నేపథ్యంలో మూడు రోజుల పాటు శానిటేషన్ పనులకు సంబంధించి, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. సోమవారం అమ్మవారి ఆలయ రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. కాలువల వద్ద బ్లీచింగ్ చల్లామన్నారు.


పైడితల్లికి పూజలు చేస్తున్న భక్తులు

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోండి

● లక్ష్మీపేటలో అవగాహన సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి

వంగర: ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో అతి సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందిన మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో ఎస్పీ దీపికా పాటిల్‌తో కలిసి కలెక్టర్ సోమవారం పర్యటించారు. పోలింగ్ కేంద్రం పరిశీలించడంతో పాటు గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగి, ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన ఓటర్ల అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గట్టి పోలీస్ బందోబస్తు, కేంద్ర బలగాల మధ్య ఓటింగ్ జరిగేలా చూస్తామని, ఎవరికీ భయపడకుండా ప్రతీ ఓటరు తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. గతంలో జరిగిన అవాంఛనీయ ఘటనలు పునరావృతం కానీయమన్నారు. ఓటర్లు ఎటువంటి భయ భ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దన్నారు. శతశాతం ఓటింగ్ జరగాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ స్థాయి అవగాహనా గ్రూపులను ఏర్పాటు చేశామని, అలాగే ప్రతీ పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీసు శాఖ నుంచి కూడా మరో సెక్టార్ అధికారిని నియమించామన్నారు. ఓటు వేయడంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఈ గ్రూపు సభ్యులకు, సెక్టార్ అధికారులకు లేదా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నపిల్లల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో క్రషలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కనే ఎస్పీ దీపికా పాటిల్

ప్రశాంతంగా ఎన్నికలు..

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ దీపికా పాటిల్ అన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధమైందన్నారు. ఓటర్లకు ధైర్యం, భరోసాను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు వేయడంలో ఏమైనా సమస్యలు ఎదురవుతాయని భావిస్తే, నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ ఆర్వో జోసెఫ్, ఆర్డీవో బి.శాంతి, డీఎస్పీ చక్రవర్తి, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ టి.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

మునకలవలసలో సేవా శిబిరం ప్రారంభం

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) యూనిట్–2 సేవా శిబిరం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ సేవా శిబిరం ఉంటుందని, విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేస్తూనే ప్రజలతో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో సురంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పురుషోత్తమరావు